## క్లుప్తంగా

### క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



నగదు అందజేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్:** విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని డీఎస్పీ జనార్దన్ నాయుడు అన్నారు. తాడిపత్రి పట్టణంలోని జేహెచ్ఆర్ఎం ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. సుష్మితకు రూ.5 వేలు, సూఫీ అల్ఫియాకు రూ.3 వేలు, లక్ష్మీదేవికి రూ.2వేలు నగదు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అలాగే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధాక్రిష్ణమూర్తి, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి, సభ్యులు ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, నరసింహులు, రమణరాజు, సూర్యనారాయణరెడ్డి, అశ్వత్థరెడ్డి, కుళాయిరెడ్డి, వెంకట్రామయ్య, కరుణాకర్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 16న మండల సమావేశం

**పుట్లూరు:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 16న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి గురువారం తెలిపారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

### ట్రిపుల్ ఐటీకి ఎంపిక



సుదీక్షరెడ్డి



అంజూమ్

**శింగనమల:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇద్దరు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ గురువారం తెలిపారు. పి.సుదీక్షరెడ్డి నూజివీడు ట్రిపుల్ ఐటికి, కే.అంజూమ్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

### కసాపురంలో ధన్వంతరీ హోమం



ధన్వంతరీ హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**గుంతకల్లు రూరల్:** ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ధన్వంతరీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ధన్వంతరీ హోమం చేపట్టారు. అనంతరం అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

### జూదరుల అరెస్టు

**గుత్తి:** పట్టణంలోని కమేళా వీధిలో ఉన్న ఓ ఇంట్లో పేకాడుతున్న ఐదుగురిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది దాడులు నిర్వహించారు. జూదరుల నుంచి ఐదు సెల్‌ఫోన్‌లు, రూ. 5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

**బుక్కరాయసముద్రం:** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. గురువారం మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిల భారత సమన్వయ వాతావరణ వ్యవసాయ పథకం ఆధ్వర్యంలో షెడ్యూలు కులాల రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు, పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలివ్వాలన్నారు. త్వరలో రేకులకుంట నుంచి సిద్దరాంపురం వరకూ రోడ్డు వేయిస్తామన్నారు.

# ‘తల్లికి వందనం’ హామీకి ఆంక్షలు!

- పథకం ఒక్క విద్యార్థికే అంటూ ప్రభుత్వ మార్గదర్శకాలు
- సీఎం చంద్రబాబుపై మహిళల ఆగ్రహం



**సాక్షి నెట్‌వర్క్:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ పథకం వర్తింపజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న తల్లికి వందనం పథకంపై కొత్త మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ పథకం లబ్ధి పొందాలంటే ఆధార్ తప్పనిసరి ఉంటూ దారిద్ర్యరేఖకు దిగువ ఉండి, 75 శాతం విద్యార్థి హాజరు శాతం ఉండాలని నిబంధనలు పెట్టారు. అలాగే తహసీల్దార్, సంబంధిత అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుందని ప్రకటించారు. అయితే ఇక్కడే సీఎం చంద్రబాబు మెలిక పెట్టారు. చదువుతున్న పిల్లలు ఎంతమంది అందరికీ ఇస్తామని ఇప్పుడు ఇంటికి ఒక్కరికి మాత్రమే పథకం వర్తింపజేసేలా నిబంధనలు పెట్టారు. దీంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకూ 38,369 మంది విద్యార్థులు, ఇంటర్‌కు సంబంధించి 982 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే గుంతకల్లు నియోజకవర్గానికి సంబంధించి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 50,565 మంది విద్యార్థులు ఉన్నారు.

### చంద్రబాబు హామీ నిలుపుకోవాలి



నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఒక్కరు 6 వ తరగతి, మరొకరు 5వ తరగతి చదువుతున్నారు. ఇద్దరినీ ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాను. ఎన్నికల ముందు తల్లికి వందనం పేరుతో బడికి వెళ్లే విద్యార్థులు ఎంత మంది ఉంటే, అంత మందికీ ఒక్కొక్కరికి 15 వేలు చొప్పున తల్లి ఖాతాలో జమ చేస్తామన్న చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు కేవలం ఒక్కరికే ఇస్తామంటున్నారు. చంద్రబాబు నాయుడు హామీ నిలుపుకోవాలి. లేకుంటే పేదవారికి ఇబ్బందిగా ఉంటుంది.

– సావిత్రి, తాడిపత్రి

### ఇద్దరికీ వర్తింపజేయాలి



నా భర్త దివ్యాంగుడు. జిరాక్స్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే.. అంతమందికీ రూ.15 చొప్పున పంపిణీ చేస్తామని చెప్పడంతో ఇద్దరు పిల్లలని ఓ ప్రైవేట్ స్కూల్‌లో జాయిన్ చేశాం. పాఠశాలలు ప్రారంభమైన రోజు నుంచే స్కూల్ వాళ్లు ఫీజు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అమ్మకు వందనం నగదు కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. ఇద్దరికీ అమ్మకు వందనం వర్తింపజేయాలి.

– షేక్ యాస్మిన్, గుంతకల్లు

## ఘనంగా పీర్ల పెట్టే గ్రామోత్సవం



యాడికి మండలం చందనలో పీర్ల పెట్టికు పొర్లు దండాలు పెడుతున్న భక్తులు



గుత్తిలో బారే హిమామ్ పీర్ల పెట్టెను ఊరేగిస్తున్న దృశ్యం

**యాడికి:** మండలంలోని చందన గ్రామంలో పీర్ల పెట్టె గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా మకాన్‌లో భద్రపరచిన పీర్ల పెట్టెను గ్రామ పెద్దల సమక్షంలో కిందికి దించారు. ముజావర్లు ఖాజాహుసేన్, చాంద్ బాషా ఫాతేహా చేశారు. సాయంత్రం మకాన్ వద్ద ఉన్న పీర్ల పెట్టెను ముజావర్ దర్గాకు తీసుకువచ్చిన అనంతరం పీర్ల పెట్టెను రంగురంగుల పూలు, పాగలతో అలంకరించారు. రాత్రి 10గంటలకు ముజావర్లు పీర్ల పెట్టను దర్గా వద్ద నుంచి మకాన్ వద్దకు ప్రత్యేక డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన వారు, సంతానం లేనివారు పొర్లు దండాలు చేస్తారు. పీర్ల పెట్ట మకాన్‌కు చేరే వరకు యువకులు, చిన్నారులు తప్పెట్లకు లయబద్ధంగా చిందులు వేశారు. అనంతరం మకాన్ ఎదురుగా ఉన్న అగ్గి గుండాన్ని యువకులు పారలతో తవ్వారు. మకాన్‌లో ముజావర్లు పెద్దపీరు స్వామి, చిన్న పీరుస్వామి, బొడ్డుపీరు స్వాములు మరో 10 వివిధ రకాల పీర్ల స్వాముల ప్రథమ దర్శనాన్ని కల్పించారు. 14న చిన్న సరిగెత్తు, 15న విడిదినం, 16న పెద్ద సరిగెత్తు, 17న పీర్ల జలది నిర్వహించనున్నట్లు ముజావర్లు తెలిపారు.

**గుత్తి:** పట్టణంలో గురువారం మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పవిత్రమైన బారే హిమామ్ పీర్ల పెట్టెను ఊరేగించారు. కోటలో నుంచి రేణుకా ఎల్లమ్మ దేవాలయం, నగరేశ్వరాలయం, కందకం, సీఎస్ఐ టౌన్ చర్చి, సాయి బాబా ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం మీదగా వాసవీ బజారులోని బారే హిమామ్ పీర్ల మకాన్ వరకూ ఊరేగింపు సాగింది. పిల్లలు, యువకులు కేరింతల మధ్య పీర్ల పెట్టెను ఊరేగించారు. ఈ నెల 14న చిన్న సరిగెత్తు, 15 విడి దినం, 16న పెద్ద సరిగెత్తు, 17న పీర్ల పండుగను నిర్వహిస్తారు.

### యువకుడి ఆత్మహత్యాయత్నం

**గుత్తి రూరల్:** మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన సింహాద్రి అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. సింహాద్రి ఓ వివాదంలో ఉండేవాడు. పోలీసులు కేసు పెడతారని స్నేహితులు చెప్పడంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం అర్ధరాత్రి గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అనంతరం కుటుంబసభ్యులకు ఫోన్‌లో విషయం చెప్పాడు. గ్రామ శివారులో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మొహర్రం ప్రశాంతంగా చేసుకోండి

**శింగనమల:** మొహర్రం సందర్భంగా గొడవకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో మొహర్రంను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలన్నారు. కొన్ని గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా కొందరిని బైండోవర్ చేశామన్నారు. మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

### పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులకు చికిత్స చేస్తున్న డాక్టర్ రత్నకుమార్

**బుక్కరాయసముద్రం:** రైతులు పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రత్నకుమార్ సూచించారు. గురువారం మండలంలోని అమ్మవారిపేట గ్రామంలో పశువుల్లో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో 45 పశువులకు గర్భకోశ సంబంధిత చికిత్సలు చేశారు. రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే 75 శాతం సబ్సిడీతో పశుగ్రాస విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు పెద్దన్న, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

**గుత్తి/గార్లదిన్నె/శింగనమల/బుక్కరాయసముద్రం:** గుత్తి పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప మాట్లాడుతూ అధిక జనాభా వల్ల అనర్థాలు వస్తాయన్నారు. అనంతరం జనాభా నియంత్రణ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్లా రాముడు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలో నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి, హనీషా, సీహెచ్ఓ లోక్ నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. శింగనమలలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ రమణ, తరిమెల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ . శంకర్‌నాయక్, ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, సీహెచ్ఓ గంగాధర్, సూపర్‌వైజర్లు అశ్వర్థ , ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా బుక్కరాయసముద్రంలోని కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కొర్రపాడు డాక్టర్ వినోద్‌కుమార్, బీకేఎస్ పీహెచ్‌సీ డాక్టర్ స్వాతి లక్ష్మి, హెల్త్ విద్యా బోధకురాలు పర్వీన్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, కేశవయ్య, సీహెచ్ఓ మోహన్‌రావు, చెన్నమ్మ, ఈశ్వరమ్మ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



పుట్లూరు మడుగుపల్లిలో మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు, విద్యార్థులు



గుత్తి రూరల్: మొక్కలు నాటుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

**గుత్తి రూరల్/గుంతకల్లు/గుంతకల్లు రూరల్/పుట్లూరు/గుత్తి/పామిడి:** మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రజాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ విజయ, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి వెంకటేశ్వరి అన్నారు. గురువారం గుత్తి మండలంలోని రజాపురం గ్రామం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థుల చేత మొక్కలను నాటించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి వాటిని దత్తతకు తీసుకొని సంరక్షించాలన్నారు. మొక్కలు పెద్ద ఎత్తున పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ వసంత లక్ష్మి, కేజీబీవీ పీఈటీ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గంతకల్లులోని పీఅండ్‌టీ కాలనీలో ఉన్న శ్రీ చైతన్య హైస్కూల్‌లో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ ఆంజి తదితరులు పాల్గొన్నారు. గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి గ్రామంలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు, వారి తల్లులతో కలిసి గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు. పుట్లూరు మండలంలోని మడుగుపల్లి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. అటవీశాఖ అధికారి వెంకటరమణ, సిబ్బంది గయాజుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆధ్వర్యంలో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, గంగ,సరస్వతి, సరళ తదితరులు పాల్గొన్నారు. పామిడిలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త, జేఎల్ నారాయణమ్మ, ఆయాలు, ప్రజలు పాల్గొన్నారు.

## ‘విన్నర్ డిజైన్ సొల్యూషన్’తో ఎస్ఆర్ఐటీ ఎంఓయూ



ఒప్పందం చేసుకుంటున్న ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం

**బుక్కరాయసముద్రం:** మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో విద్యా పరిశోధన అవకాశాలు పెంపొందించుకోవడం కోసం బెంగళూరులో ఉన్న విన్నర్ డిజైన్ సొల్యూషన్స్ ఎల్ఎస్‌పీతో (ఎంఓయూ) ఒప్పందం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ గురువారం తెలిపారు. ఈ సహకారం విద్యార్థులకు పరిశ్రమలో అనుభవం, ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడం ద్వారా విద్యా, పరిశోధనా అవకాశాలు పెంపొందించడంలో తోడ్పడుతుందన్నారు. విన్నర్ డిజైన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ స్థాపకుడు సీఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం అకాడమీ, పరిశ్రమ మధ్య గ్యాప్ దూరం చేసి విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం ఆవిష్కరణకు ప్రేరణ ఇవ్వగలదన్నారు. విన్నర్ డిజైన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పీ 7డీ బీఐఎంపై దృష్టి సారించి బీఐఏఎల్ ఎస్‌సీఆర్, రామ్ మందిర్ వంటి ప్రాజెక్ట్‌లపై పని చేస్తూ ఏసీఈ పరిశ్రమలో 8 సంవత్సరాలకు పైగా అనుభవాన్ని కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్ రెడ్డి, సివిల్ విభాగం హెడ్ డాక్టర్ చిన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గుత్తి రూరల్:** మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున ద్విచక్రవాహనం బోల్తా పడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. ఎంగిలిబండకు చెందిన రాము, చిన్న కుళ్లాయి ద్విచక్రవాహనంలో గుత్తి పట్టణానికి బయలుదేరారు. గ్రామ శివారులో బస్టాప్ వద్ద వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన ఇద్దరిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

**తాడిపత్రి రూరల్:** ఉపాధి పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి గల చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఓ నరేంద్ర సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అడిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు. ఏపీఓ మాట్లాడుతూ బ్లాక్ ప్లాంటేషన్ కింద ఐదు ఎకరాల దేవుని మాన్యాల్లో మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్డుకు ఇరువైపులా మూడు కిలోమీటర్ల మేర మొక్కలు నాటుతున్నామన్నారు. మండలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఐజయ్య తెలిపారు. మండలంతో పాటు తాడిపత్రి నియోజక వర్గానికి జేసీ నాగిరెడ్డి ప్రాజెక్టు ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. వైద్యాధికారి కేశవనందన్ మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్, అతిసారం, డయేరియా, డెంగీ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మహితా కిరణ్, ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి, పశువైద్యాధికారి హరిక్రిష్ణ, చుక్కలూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, ఎంపీడీఓ నరసింహరావు, ఈఓఆర్‌డీ జిలాన్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాలొన్నారు.

## శిక్షణ తరగతులను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

**గుంతకల్లు:** మదనపల్లిలోని హార్సిహిల్స్ ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని అ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు మున్సిపాలిటీలో ఈపీఎఫ్, ఈఎస్ఐలు అందక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా మున్సిపల్ స్కూళ్లలో పని చేస్తున్న స్వీపర్లు, వాచ్‌మన్‌లకు వేతనాలు పెంచాలన్నారు. అనంతరం గుంతకల్లు మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ వెంటకరమణయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయండి

**పామిడి:** పట్టణంలోని రంగసుబే ఫిర్కా భగవాన్‌దాస్ విఠోబస్వామి దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహించే విఠోబస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఈఓ క్రిష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఆయా రోజుల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈనెల 20న సాయంత్రం భావసార క్షత్రియ సమాజ్ సంతర్పణ, 21న సాయంత్రం దీపోత్సవం, 22న దిండి భజనతో కూడిన ఉట్ల పరుషతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. 23న మంగళవారం పామిడమ్మ దేవత హారతి ఉంటుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకూ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు.

### పంచాయతీ సిబ్బందికి ఆర్థికసాయం

**బుక్కరాయసముద్రం:** మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓబులపతికి మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి సిబ్బంది ఆర్థికసాయం అందించారు. ఓబులపతి గత కొంత కాలంగా వెన్నెముక సమస్యతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు సర్పంచ్ పార్వతి, సిబ్బందితో కలసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి సాధిక్, సిబ్బంది పాల్గొన్నారు.

### భారతి సిమెంట్ నాణ్యమైనది



ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న కంపెనీ టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్ నాయక్

**బుక్కరాయసముద్రం:** భారతి సిమెంట్ కట్టడాలకు ఎంతో నాణ్యమైనదని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ మోతీలాల్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రెడ్డిపల్లిలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీ సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతోందన్నారు. భవనాల స్లాబ్‌కు మంచి అనువైన సిమెంట్ అన్నారు. పర్యావరణానికి ఎంతో అనుకూలమన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువ చేసే ప్రమాద బీమా బాండ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సేల్స్‌మేనేజర్ సుబ్బరాయుడు, డీలర్ క్రిష్టారెడ్డి పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

### నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

**గుంతకల్లు:** నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టారు. సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ నేతృత్వంలో సంఘ్ కార్యాలయం నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో దాదాపు 70 శాతం మంది ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానం వర్తిస్తుండంతో తీవ్రంగా నష్టపోయే ప్రధాన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని రద్దు చేసి..పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని అనేక ఉద్యమాలు, ధర్నాలు చేపట్టిన ఈ కార్మిక వ్యతిరేక ప్రభుత్వం తమ సిఫార్సులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు మల్లికార్జున, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా నిర్మిస్తే చర్యలు



అనుమతి లేని నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

**గుత్తి:** మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా చేపట్టిన పలు నిర్మాణాలను గురువారం ఆయన మున్సిపల్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఇక నుంచి తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దుకాణాలు, హోటళ్ల తనిఖీ చేశారు. ప్లాస్టిక్ విక్రయిస్తున్న యజమానులకు జరిమానా విధించారు.

### ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

**గుంతకల్లు:** ఎన్‌సీసీ శిక్షణ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ అన్నారు. గురువారం ఆ కళాశాలలో ఎన్‌సీసీ పూర్తి చేసిన 16 మంది క్యాడేట్స్‌కు సరిఫికెట్లను ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ అనంతపురంలోని ఎన్‌సీసీ నగర్‌లో గత ఫ్రిబవరి, మార్చిలో ఆరో ఆంధ్ర బెటాలియన్ వారిచే నిర్వహించిన శిక్షణలో తమ కళాశాల నుంచి 16 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ పట్టా పొందిన చరిత్ర విభాగం అధ్యాపకుడు నాగార్జునను సన్మానించారు. రాజస్థాన్‌లోని అల్వాల్ పట్టణంలో ఉన్న సన్‌రైజ్ విద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ బబ్లీ రాణీ పర్యవేక్షణలో ‘రిలిజియన్ పాలిటిక్స్, ఇన్ ఆర్లీ ఇండియా’ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆయన డాక్టరేట్ పట్టా పొందినట్లు వారు తెలిపారు.